క్లుప్తంగా

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : స్థానిక 40వ డివిజన్ పరిధిలో ఉన్న మహిళా శాఖా గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ వారోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా నగర డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు, కార్పొరేటర్ తుమరాడ స్రవంతి పాల్గొన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవం పురస్కరించుకుని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మంత్రి విశ్వరూప్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ ఎన్‌జీవోస్ నాయకులు

ఏలూరు(మెట్రో) : ఏపీ ఎన్‌జీవోస్ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళతానని ఏలూరు ఇన్‌చార్జి మంత్రి, రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. ఏలూరు జెడ్పీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏపీ ఎన్‌జీవోస్ నాయకులు మార్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్, నెరుసు రామారావు, నాయకులు మంత్రికి మొక్కను అందజేశారు. ఉద్యోగుల సమస్యను మంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి విశ్వరూప్ ప్రభుత్వం ఉద్యోగుల పట్ల సానుకూలంగా ఉందని చెప్పారు. సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

నేడు కౌన్సిల్ సర్వసభ్య ప్రత్యేక సమావేశం

కోఆప్షన్ మహిళా సభ్యురాలి ఎన్నిక

ఏలూరు టౌన్ : ఏలూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో సర్వసభ్య ప్రత్యేక సమావేశాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నామని నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ తెలిపారు. సమావేశంలో నగరపాలక సంస్థ కోఆప్షన్ మహిళా సభ్యురాలి ఎన్నికపై కౌన్సిల్ సభ్యుల ఆమోదానికి నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు. ఆర్‌ఆర్‌పేట ప్రాంతానికి చెందిన మాజీ కౌన్సిలర్ కొంపల్లి తాయారు మహిళా కోఆప్షన్ సభ్యురాలిగా దరఖాస్తు చేసుకున్నారని, దీనిపై కౌన్సిల్ సభ్యులు ఎన్నుకుంటారని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన కేంద్ర బృందం

పెదవేగి : మండలంలోని విజయరాయి అంగన్‌వాడీ కేంద్రాన్ని డీపీఆర్‌సీ కేంద్ర బృందం మంగళవారం పరిశీలించింది. ఆరుగురు సభ్యుల బృందం 142 అంగన్‌వాడీ సెంటర్‌లో విధి విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ, సీడీపీఓ, సూపర్‌వైజర్లు హాజరయ్యారు.

రైతుల సేవలో సొసైటీ

గణపవరం: రైతులకు సేవలందించడంలో సహకార సంఘాల పాత్ర అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. మంగళవారం గణపవరం మండలం కాశిపాడులో సహకార వారోత్సవాల సందర్భంగా కాశిపాడు సొసైటీ, జిల్లా పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సొసైటీ ఛైర్పర్సన్ కోట సత్యనారాయణ ప్రారంభించారు. విజయవాడ కామినేని ఆస్పత్రి, భీమవరం విష్ణు కాలేజీ ఆధ్వర్యంలో సుమారు 200 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ కోట నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు జంపన పద్మావతి రమేష్ రాజు, పార్టీ గ్రామ అధ్యక్షుడు చిన్నం సిల్వెస్టర్ రాజు, జిల్లా పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, మండల శాఖ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలుద్దాం

- ఏలూరులో జోరుగా 'వై ఏపీ నీడ్స్ జగన్'
- వైఎస్సార్ సీపీ క్యాడర్‌లో జోష్



13వ డివిజన్‌లో పార్టీ జెండా ఎగురువేస్తున్న క్లస్టర్-1 జేసీఎస్ కన్వీనర్ సదానందం, మహిళా అధ్యక్షుడు శ్రీదేవి, యూత్ అధ్యక్షుడు రమేష్



చొదిమెళ్లలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, క్లస్టర్-3 కన్వీనర్ తుమరాడ స్రవంతి

ఏలూరు టౌన్: పేదలకు మేలు చేస్తోన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ఏలూరు నగర డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, పార్టీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు అన్నారు. ఏలూరు నగరంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమాన్ని పలు డివిజన్లలో చేపట్టారు. పార్టీ నాయకులు, క్యాడర్, మహిళా నేతలు పాల్గొని పార్టీ క్యాడర్‌లో నూతన ఉత్సాహాన్ని నింపారు.

- మోతేవారితోట సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. క్లస్టర్-1 అధ్యక్షుడు ఎన్ సుధీర్‌బాబు, మహిళా అధ్యక్షురాలు గుడిదేశి లక్ష్మీశారద, యువజన అధ్యక్షుడు కలవకొల్లు సాంబ పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం డివిజన్ పరిధిలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల ప్రదర్శన బోర్డును ఆవిష్కరించారు. చరిత్రలో ఎన్నడూలేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేశారని, మేనిఫెస్టోను పక్కాగా అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని నాయకులు వివరించారు. పేదలకు విద్య, వైద్యం ఉచితంగా అందాలంటే మరోసారి రాష్ట్రానికి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, కార్పొరేటర్ పప్పు ఉమామహేశ్వరరావు, యర్రంశెట్టి సుమన్, సచివాలయ ఉద్యోగులు, పార్టీ నాయకులు ఉన్నారు.
- వైఎస్సార్ కాలనీ వెంకటాపురం సచివాలయం -4 పరిధిలో ఏపీ జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. తొలుత క్లస్టర్-1 మహిళా అధ్యక్షురాలు పిల్లంగోళ్ల శ్రీదేవి, జేసీఎస్ కన్వీనర్ మోటమర్రి సదానందం, యువజన అధ్యక్షుడు జిజ్జువరపు రమేష్, జేసీఎస్ జిల్లా కన్వీనర్ వైఎస్వీ శివరావు పార్టీ జెండాను, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. పేదలకు గూడు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వారు అన్నారు. పేదల పిల్లలకు ఇంగ్లిష్ మీడియం విద్య, నాడు – నేడు పథకంలో ప్రభుత్వ బడుల అభివృద్ధి, డిజిటల్ క్లాస్ రూములు, నాణ్యమైన భోజనం, విద్యకానుక ఇలా అనేక పథకాలతో విద్యారంగాన్ని సమూలంగా మార్పు చేశారని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జిజ్జువరపు విజయనిర్మల, సచివాలయ కన్వీనర్ మల్లిక్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.
- 25వ డివిజన్ చొదిమెళ్లలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, క్లస్టర్ అధ్యక్షురాలు తుమరాడ స్రవంతి, కార్పొరేటర్ బత్తిన విజయ్ కుమార్ పార్టీ జెండాను, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తూ ఆరోగ్య భరోసా కల్పిస్తున్నారని వారు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్, వైఎస్సార్ విలేజ్ క్లీనిక్స్, ఆరోగ్యశ్రీ, 108, 104, తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ వాహనాలు ఇలా అనేక కార్యక్రమాలతో ప్రభుత్వ వైద్యాన్ని మరింత చేరువ చేశారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన శైవ క్షేత్రాలు

- కార్తీక మాసోత్సవాలు ప్రారంభం
- మహా శివునికి అభిషేకాలు, అలంకరణలు



విద్యుత్ కాంతుల్లో ఏలూరు గాంధీనగర్ శివాలయం



కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళ



విశేషాలంకరణలో ఏలూరు పత్తేబాదలోని చొడేశ్వరి రామలింగేశ్వరస్వామి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): శోభకృత్ నామ సంవత్సర కార్తీక శుద్ధ పాడ్యమి పర్వదినాన మంగళవారం ఏలూరు నగరం శివనామస్మరణతో మార్మోగింది. శైవ క్షేత్రాల్లో కార్తీక మాసోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయాల్లో విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. సాయంత్రం ఆకాశదీప పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పత్తేబాద చొడేశ్వరి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఉదయం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, నిత్య పూజలు చేశారు. గణపతి పూజ, గోపూజ, సాయంత్రం ఆకాశదీప పూజ నిర్వహించారు. ఆలయ అర్చకుడు కొడమంచిలి లక్ష్మణరావు పూజలు చేయగా, కార్యక్రమాలను కార్యనిర్వహణాధికారి డి.శంకరరావు పర్యవేక్షించారు.

పవర్ పేటలో..

కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో ఉదయం భక్తుల గోత్ర నామాలతో స్వామివారికి రుద్రాభిషేకాలు నిర్వహించారు. గో పూజ, నిత్యాభిషేకాలు చేశారు. సాయంత్రం ఆకాశ దీప పూజలు నిర్వహించి, విశేష హారతి సేవ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అర్చకుడు కందుకూరి రామబ్రహ్మనంద శర్మ పూజలు చేయగా, కార్యక్రమాలను కార్యనిర్వహణాధికారి ఎం రామాంజనేయులు పర్యవేక్షించారు.

దత్తనాథ క్షేత్రంలో..

శ్రీ నం దత్తనాథ క్షేత్రంలోని సర్వదోష పరిహారక విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో ఉదయం లఘున్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం, అలంకరణ అర్చన నిర్వహించారు. సాయంత్రం ప్రదోషకాల అర్చన, రుద్ర త్రిశతి నామార్చన, బిల్వార్చన, శివ సహస్రనామ పారాయణ, హారతి, నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. క్షేత్రం అర్చకుడు గంటసాల రామకృష్ణ విశేష పూజలు చేయగా, క్షేత్రం వ్యవస్థాపక ట్రస్టీ వేణుగోపాల్ ఉనాని, కార్యదర్శి కాకి బాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ధర్మభేరి ప్రాంగణంలో..

జూట్‌మిల్ వద్ద ధర్మభేరి ప్రాంగణంలో అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో కార్తీక దామోదర లక్ష దీపోత్సవం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. తెల్లవారుజాము 4.30 నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు మంగళ హారతి, తులసి పూజ, మహామంత్ర ధ్యానం, శ్రీమద్ భాగవత ప్రవచన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు గోవర్ధన పూజ, గోవర్ధన ప్రవచనం చేసి లక్షదీపోత్సవం నిర్వహించారు. ఇస్కాన్ స్థానిక అధ్యక్షుడు రాధా వల్లభ దాస్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పలు దేవస్థానాల్లో..

నగరంలోని దక్షిణపు వీధి జలాపహరేశ్వర స్వామి, మార్కండేయ ఓంకార విశ్వేశ్వర స్వామి, అగ్రహారం నగరేశ్వర స్వామి, అన్నపూర్ణ సమేత ప్రతాప విశ్వేశ్వర స్వామి, ఆదివారపు పేట మల్లికార్జున స్వామి, పర్వత వర్ధని సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానాల్లో విశేష అభిషేకాలు, నిత్య పూజలు, ప్రత్యేక అలంకరణలు చేశారు.

విద్యార్థులు పోటీతత్వం పెంచుకోవాలి



చిన్నారికి బహుమతి ప్రదానం చేస్తున్న జిల్లా జడ్జి పురుషోత్తం కుమార్

ఏలూరు (టూటౌన్) : విద్యార్థి దశ నుంచే పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సి.పురుషోత్తం కుమార్ అన్నారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు మంగళవారం తన చాంబర్‌లో ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్ బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. పోటీ పరీక్షల్లో పాల్గొనడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని విద్యార్థులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేకేవీ బుల్లి కృష్ణ పాల్గొన్నారు.

బాలల భవిష్యత్తుకు బంగారు బాట



కొక్కిరాయిలంక పాఠశాలలో జరిగిన బాలల దినోత్సవం

ఏలూరు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాలల భవిష్యత్తుకు బంగారు బాట వేశారని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు కొనియాడారు. బాలల దినోత్సవం సందర్భంగా ఏలూరు రూరల్ గ్రామం కొక్కిరాయిలంక మండల పరిషత్ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నాడు – నేడు పథకం బాలలకు బంగారు బాట పడిందని సంతోషం వ్యక్తం చేశారు. అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాలతో పాటు నాడు – నేడు పథకం ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమయ్యాయన్నారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. పలు పోటీల్లో ప్రతిభ చాటిన బాలబాలికలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ తోకల అమల, ఉపసర్పంచ్ ఇంటి భూషణరాజు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాలవికాస్ భారతి ఆధ్వర్యంలో..

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వైఎస్సార్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఆ సంస్థ అధ్యక్షుడు కట్టా సత్యనారాయణ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. సీనియర్ న్యాయవాది కూన కృష్ణారావు, మానవత సంస్థ ప్రతినిధి మేతర అజయ్ బాబు, పోలవరపు దేవ రత్నాకర్, వల్లూరిసాయి సుధ, దేవినేని భాస్కర రావు పాల్గొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

జంగారెడ్డిగూడెం: దేశ వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక వేధింపులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గా భవాని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక చిట్టూరి గణేశ్వరరావు టౌన్ హాల్ నందు ఏలూరు జిల్లా ప్రథమ మహా సభ జరిగింది. ఈ మహాసభ వరక శ్యామల కుమారి, కొండేటి బేబీ, కరాటం సీతా మహాలక్ష్మి అధ్యక్షత వహించారు. సీనియర్ మహిళా సమాఖ్య నాయకురాలు మన్నవ లక్ష్మీ సౌభాగ్యం మహిళా సమాఖ్య జెండా ఆవిష్కరించారు. మణిపూర్ ఘటనలో మృతి చెందిన మృతులకు కొద్దిసేపు మౌనం పాటించారు. ఈ సందర్భంగా దుర్గా భవాని మాట్లాడుతూ మహిళా సమాఖ్య సుదీర్ఘ పోరాటం వల్ల స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌లు వచ్చినట్లు తెలిపారు. ఈ నెల 17, 18, 19 తేదీల్లో నంద్యాలలో 15వ రాష్ట్ర మహిళా సమాఖ్య మహాసభలు నిర్వహిస్తున్నామని, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, మహిళా సమాఖ్య సభ్యులు మన్నవ యామిని, అడ్డగర్ల లక్ష్మి ఇందిర, మదిని జగదాంబ, మావూరి విజయ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలల దినోత్సవం



బహుమతులు అందుకున్న బాలలు



సంగీత్ మాధుర్‌ను సన్మానిస్తున్న హిందూ యుజవన సంఘం ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన పలు సంస్థల ఆధ్వర్యంలో బాలల దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వైఎంహెచ్ఏ హాలులో హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో బాలలకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఇటీవల సివిల్స్‌లో విజయం సాధించి డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులైన కానాల సంగీత్ మాధుర్‌ను ఘనంగా సన్మానించారు. సంగీత్ మాధుర్‌ను విద్యార్థులు, బాలలు స్ఫూర్తిగా తీసుకుని జీవితంలో ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని వక్తలు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, ఉషా గ్రూప్ సంస్థల అధినేత వీవీ బాలకృష్ణారావు, హిందూ యుజవన సంఘం ప్రతినిధులు యర్రా సోమలింగేశ్వరరావు, కేవీ సత్యనారాయణ, కానాల బాల వెంకట రమేష్, జవ్వాజి మోహన విఠల్, మజ్జి కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్‌డీజీకే పాఠశాలలో..

శనివారపు పేటలోని ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాల కృష్ణయ్య (ఏఆర్‌డీజీకే) పాఠశాలలో విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. సాంసప్కృతిక కార్యక్రమాలు, యోగా విన్యాసాలు ప్రదర్శించారు. స్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం వీకే జయకుమార్, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు గొంతిన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. పోటీల విజేతలకు బహుమతులు అందచేశారు.

బాలల హక్కులు సంరక్షించాలి



ఏఆర్‌డీజీకే స్కూల్‌లో విద్యార్థుల యోగా విన్యాసం

ఏలూరు రూరల్: బాలలు హక్కులను సంరక్షించాలని రూరల్ సీఐ ఎం రాజశేఖర్ అన్నారు. మాదేపల్లి జెడ్పీ పాఠశాలలో స్త్రీ శిశు సంక్షేమశాఖ, చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ సంయుక్తంగా బాలల దినోత్సవాన్ని నిర్వహించాయి. ఐక్యరాజ్య సమితి బాలలకు జీవించే హక్కు, రక్షణ, అభివృద్ధి, విద్యా హక్కులు ప్రధానమైనవిగా గుర్తించిందని సీఐ చెప్పారు. బాలలు మానసిక, శారీరకంగా ఉన్నత స్థానంలో నిలవాలంటే వారి హక్కులను సంరక్షించాలన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి ఎ.పద్మావతి మాట్లాడుతూ చిన్నతనంలోనే బాలికలకు పెళ్లి చేయడం వారి పురోభివృద్ధికి అడ్డుకట్ట అన్నారు. ప్రతిఒక్కరూ బాల్య వివాహాలను అడ్డుకోవాలని కోరారు. ఈ సందర్భంగా బాలల హక్కుల కాపాడాలంటూ రూపొందించిన వాల్ పోస్టర్‌ను ప్రదర్శించారు. హెచ్ఎం ఎస్ వెంకటలక్ష్మి, ఆర్ రాజేష్, ఎస్ రవిబాబు, సీహెచ్ శ్రీకాంత్ తదితరులు బాలలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	30
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	29
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	34
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	15
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	12
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	15
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	23
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	19
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	18
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

జూదరుల అరెస్ట్



జూదరులను అదుపులోకి తీసుకున్న ఎస్సై శుభశేఖర్, సిబ్బంది

ఏలూరు టౌన్: ఏలూరు టూటౌన్ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని టూటౌన్ ఎస్సై శుభశేఖర్ అన్నారు. టూటౌన్ సీఐ పి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏలూరు కుమ్మరిరేవు ప్రాంతంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని ఎస్సై శుభశేఖర్ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. రూ.48,500 స్వాధీనం చేసుకున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, పేకాట, క్రికెట్ బెట్టింగులు వంటివి నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

డిగ్రీ విద్యార్థినులకు బంగారు పతకాలు



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక ఇండోర్ స్టేడియంలో ఈ నెల 11వ తేదీన నిర్వహించిన ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలోని అంతర్ కళాశాల స్థాయి వెయిట్ లిఫ్టింగ్ టోర్నమెంట్‌లో స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ జి.గిరిబాబు తెలిపారు. ఈ టోర్నీలో తమ కళాశాల బీకాం తృతీయ సంవత్సరం విద్యార్థి సీహెచ్ ఉమ 71 కిలోల విభాగంలో 105 కిలోల బరువునెత్తి బంగారు పతకం, బీకాం తృతీయ సంవత్సరం విద్యార్థిని సీహెచ్ దేవి 64 కిలోల విభాగంలో 115 కిలోల బరువునెత్తి బంగారు పతకం సాధించారని వివరించారు. వీరిని మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తనతోపాటు వైస్ ప్రిన్సిపాల్ కె.అజయ్ కుమార్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి టీవీ దుర్గాప్రసాద్, ఎం కృష్ణ చైతన్య, ఎస్ పరమేశ అభినందించారని పేర్కొన్నారు. విద్యార్థినులు మరింత నైపుణ్యాన్ని పెంపొందించుకొని జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని గిరిబాబు ఆకాంక్షించారు.

నేడు ఆత్మదీపం వర్షిప్ సెంటర్ ప్రారంభం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక గ్రీన్‌సిటీలో ఏర్పాటు చేసిన ఆత్మదీపం వర్షిప్ సెంటర్‌ను బుధవారం ప్రారంభించనున్నట్లు పాస్టర్ మైఖేల్ జోసఫ్ రాజా ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన రాజ్ ప్రకాష్ పాల్ ప్రభువు నామంలో నూతన మందిరాన్ని ప్రతిష్ఠించి వాక్యోపదేశం చేస్తారని పేర్కొన్నారు.

పేదల కోసం జగనే మళ్లీ సీఎం కావాలి

ద్వారకాతిరుమల: పేదల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడాలంటే మళ్లీ జగన్ సీఎం కావాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ఎం.నాగులపల్లిలో మంగళవారం నిర్వహించిన వై ఏపీనీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.